సాక్షి
విశాఖపట్నం

శనివారం । 18 । మార్చి । 2023



చదువుకున్న కళాశాల కోసం..

ఏయూ ఫార్మసీ కళాశాల పూర్వ విద్యార్థి దేవ పురాణం విరాళంతో నిర్మించిన హాస్టల్ భవనం అందుబాటులోకి వచ్చింది. IIలో



సెల్ టవర్లతో ఇబ్బందులు

సెల్ టవర్లతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని జీవీఎంసీ పట్టణ ప్రణాళికా విభాగం నిర్వహించిన స్పందనలో ఫిర్యాదులందాయి. IIలో



నేడు భారత్–ఆస్ట్రేలియా జట్ల రాక

భారత్ –ఆస్ట్రేలియా క్రికెట్ జట్ల సభ్యులు శనివారం మధ్యాహ్నం నగరానికి చేరుకోనున్నారు. IIలో

న్యూస్‌రీల్

ఏఎంసీలో సీట్ల పెంపు



మహారాణిపేట (విశాఖ దక్షిణ): ఆంధ్ర వైద్య కళాశాలలో పోస్టు గ్రాడ్యుయేట్ సీట్ల పెంపునకు మెడికల్ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. మొత్తం 136 సీట్లకు గానూ రెండు దశల్లో 89 సీట్లు పెంపునకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వచ్చే అకడమిక్ ఇయర్ నుంచి అడ్మిషన్లు కల్పిస్తామని ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు తెలిపారు. సిటి సర్జరీ, డీవీఎల్, ప్రసూతి విభాగం, పెథాలజీ, సైకాలజీ, న్యూరాలజీ, సర్జరీ, కమ్యూనిటీ మెడిసిన్‌లో సీట్లు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది.

ఏపీ పీజీ సెట్ కార్యాలయం ప్రారంభం



కార్యాలయ ప్రారంభోత్సవంలో ఏయూ వీసీ

ఏయూక్యాంపస్: రాష్ట్ర వ్యాప్తంగా పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఏపీ పీజీసెట్ కార్యాలయాన్ని ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ప్రారంభించారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి సమక్షంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య కిశోర్ బాబు చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం కన్వీనర్ ఆచార్య రమణయ్యకు వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అభినందించారు. ప్రభుత్వం అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, ప్రిన్సిపాల్స్ ఆచార్య వై.రాజేంద్ర ప్రసాద్, టి.శోభశ్రీ, జి.శశిభూషణ రావు, ఎస్.కె భట్టి, వి.విజయలక్ష్మి, ఆచార్య భాస్కర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సినిమా షూటింగ్ ప్రారంభం



నటీనటులపై క్లాప్ కొడుతున్న మేయర్

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర) : దొర ఎంటర్‌టైన్‌మెంట్స్ సమర్పణలో ప్రొడక్షన్ నంబర్ 1 చిత్రం షూటింగ్ శుక్రవారం కైలాసపురం దరి డీఎల్‌బీ కల్యాణమండపం వద్ద గల సాయిబాబా ఆలయంలో ప్రారంభమైంది. జీవీఎంసీ మేయర్ గొలగాని హరివెంకటకుమారి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి నటీనటులపై క్లాప్ కొట్టారు. సింగిల్ షెడ్యూల్‌లో సినిమా పూర్తి చేస్తామని.. ఏప్రిల్‌లో విశాఖ, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో షూటింగ్ జరుపుతామని దర్శక, నిర్మాతలు రామ్‌గోపాల్ రత్నం, హనుమంతు తుకారామ్ తెలిపారు. ఈ చిత్రంలో వంశీ, ప్రియాంక సింగ్, కీర్తన వర్మలు హీరో, హీరోయిన్లుగా నటిస్తున్నారు. శుక్రవారం జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో వీజేఎఫ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు కళాభారతిలో అన్నమయ్య వర్ధంతి

మద్దిలపాలెం (విశాఖ తూర్పు): అన్నమయ్య 520వ వర్ధంతిని మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో త్యాగరాజ ఆరాధన ట్రస్ట్ ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో నిర్వహించనున్నట్టు ట్రస్ట్ కార్యదర్శి డాక్టర్ గుమ్ములూరి రాంబాబు తెలిపారు. శనివారం సాయంత్రం 6.30 గంటలకు చైతన్య సోదరుల శిష్య బృందం 70 మందితో సప్తగిరి సంకీర్తన గానం చేయనున్నారన్నారు. ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు సాహితీ కార్యక్రమంలో ప్రముఖ వక్త రాంభట్ల నృసింహ శర్మ వసంత కవనం సాహిత ప్రసంగం చేయనున్నారని తెలిపారు.

రాష్ట్రస్థాయికి 16 ప్రాజెక్టుల ఎంపిక

విశాఖ విద్య: రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మనక్ అవార్డ్స్ పోటీలకు విశాఖ జిల్లా నుంచి 16 ప్రాజెక్టులు ఎంపికైనట్టు డీఈవో ఎల్. చంద్రకళ, జిల్లా సైన్స్ అధికారి మెట్ట వెంకట విశ్వేశ్వర రావు తెలిపారు. విశాఖ జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 244 ప్రాజెక్టులు నమోదు చేసుకోగా, జిల్లా స్థాయి పోటీలకు 164 ప్రాజెక్టులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. వీటిని పరిశీలించిన న్యాయనిర్ణేతలు రాష్ట్ర స్థాయికి 16 ప్రాజెక్టులను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ మనక్ అవార్డ్స్ పోటీలు ఈ నెల 23, 24 తేదీల్లో కాకినాడలో జరుగుతాయన్నారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులకు తగిన తర్ఫీదు ఇచ్చేలా ఆయా పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు, హెచ్ఎంలు శ్రద్ధ తీసుకోవాలని డీఈవో చంద్రకళ సూచించారు.

మునిగిన వెసల్స్‌తో ముప్పు

- దెబ్బతింటున్న మరబోట్ల అడుగు భాగాలు
- చేపలరేవులో వృథా అవుతున్న బోట్లు నిలిపే స్థలం
- గతంలో ఈ హార్బర్‌లో 20కి పైగా మునకేసిన బోట్లు, ట్రాలర్లు
- అవస్థలు పడుతున్న బోటు యజమానులు



హార్బర్‌లో మునిగిపోయిన వెసల్

సాక్షి, విశాఖపట్నం: విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో మునిగిపోయిన మరపడవలు, వెసల్స్, ట్రాలర్లు.. బోటు యజమానులను ముప్పు తిప్పలు పెడుతున్నాయి. ఈ హార్బర్‌లో హుద్‌హుద్ తుపాను సమయంలోనే కాదు.. దాదాపు రెండు దశాబ్దాల పైనుంచి వివిధ కారణాలతో పలు బోట్లు, వెసల్స్ మునిగిపోయి ఉన్నాయి. హుద్‌హుద్ దాటికి ఈ హార్బర్‌లో సుమారు 65 బోట్లు మునకేశాయి. వీటిలో చాలావరకు సంబంధిత యజమానులు వెలికి తీయగలిగారు. హుద్‌హుద్‌కు ముందు, ఆ తర్వాత మునిగిన బోట్లు, వెసల్స్, ట్రాలర్లను వెలికి తీయకుండా వదిలేశారు. హార్బర్‌లో ఇలాంటివి సుమారు 25 ఉన్నాయని చెబుతున్నారు. వీటిలో వెసల్స్, ట్రాలర్లు ఏడెనిమిది వరకు ఉంటాయి. దీంతో చేపలవేటకు వెళ్లి హార్బర్‌కు తిరిగొచ్చే మరబోట్ల అడుగు భాగాలకు మునిగిపోయి ఉన్న బోట్లు, వెసల్స్ తగిలి దెబ్బ తింటున్నాయి. వీటికి మరమ్మతులు చేయించుకోవడం బోటు యజమానులకు ఆర్థికంగా భారమవుతోంది. పైగా రిపేర్లు పూర్తయ్యే సరికి 10–15 రోజుల సమయం పడుతుంది. దీంతో వేటకు ఆటంకం కలిగి నష్టపోవలసి వస్తోంది.

వెలికతీత పెనుభారం..

కొంతమంది యజమానులు ఉద్దేశ పూర్వకంగానే వైపు తమ ట్రాలర్లు, వెసల్స్ హార్బర్‌లో ముంచేస్తుంటారని చెబుతున్నారు. వాటిపై రూ.కోట్లలో తెచ్చిన బ్యాంకు రుణాలు తీరకపోవడం, మరమ్మతులకు గురవడం, వాటిని తిప్పడం గిట్టుబాటు కాకపోవడం వంటివి ఇందుకు కారణమని అంటున్నారు. ఒక్కో వెసల్ పొడవు 20–25 మీటర్లు ఉంటుంది. ఇలా మునిగిపోయిన/ముంచేసిన వీటిని వెలికి తీయడం భారీ వ్యయంతో కూడుకున్న పని. అందువల్ల వెసల్స్/ట్రాలర్ల యజమానులు వాటిని అలాగే వదిలి పెడుతున్నారు. ఇలాంటివి 3, 4, 5, 6, 7, 8, 9 నంబర్ల జెట్టీల వద్ద ఉంటున్నాయి. ఇక మునిగిపోయిన బోట్ల వెలికితీతకూ బోటు యజమానికి భారీగానే ఖర్చవుతుంది. మునిగిన బోటను బయటకు తీయడానికి క్రేన్‌కు కనీసం రూ.లక్ష వరకు చెల్లించాల్సి వస్తుంది. వేట ఆశాజనకంగా లేకపోవడం, ఆర్థికంగా దెబ్బతినడం వంటి పరిస్థితుల వల్ల బోటు యజమాని వాటిని వెలికితీసే స్తోమతలేక ముందుకు రావడం లేదు. ఈ హార్బర్ విశాఖ పోర్టు అథారిటీ (వీపీఏ) అధీనంలో ఉంది. దీంతో హార్బర్‌లో మునిగిపోయిన బోట్లు, వెసల్స్, ట్రాలర్లను వీపీఏ వెలికితీయాల్సి ఉంటుంది. అయితే వీపీఏ వివిధ కారణాలు చూపుతూ ఆ పని చేపట్టకపోవడంతో తాము అవస్థలు పడుతున్నామని మరపడవల యజమానులు ఆవేదన చెందుతున్నారు.

ఇరుకుగా మారిన హార్బర్..

మరోవైపు వేటకు పనికిరాకుండా పోయిన వెసల్స్‌ను కూడా ఈ హార్బర్‌లోనే ఉంచేశారు. వివిధ జెట్టీలకు కట్టేసిన వెసల్స్ 15కి పైగా ఉన్నాయి. ఇలాంటివి 10, 11 నంబర్ల జెట్టీల వద్ద కనిపిస్తున్నాయి. చాలావరకు ఇవి శిథిలస్థితిలో ఉన్నాయి. మునిగిపోయిన మర బోట్లు, వెసల్స్, ట్రాలర్లతో పాటు జెట్టీలకు కట్టేసిన పాత వెసల్స్‌తో విశాలమైన విశాఖ ఫిషింగ్ హార్బర్ కుచించుకుపోయిందని, బోట్లు నిలుపుదలకు ఇబ్బంది తలెత్తుతోందని రాష్ట్ర మరపడవల సంఘం అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ ‘సాక్షి’కి తెలిపారు. సుమారు 700కు పైగా మరబోట్లు నిలిపే సామర్థ్యం ఉన్న ఈ చేపలరేవు ఇప్పుడు 300 బోట్ల నిలపడం కష్టతరంగా మారింది. ప్రస్తుతం మునిగి ఉన్న బోట్లు, వెసల్స్‌ను వెలికి తీయడంతో పాటు జెట్టీలకు కట్టేసి వృథాగా ఉంచిన వెసల్స్‌ను తొలగిస్తే మరో 300 బోట్లు నిలపడానికి వీలవుతుందని వైశాఖి డాల్ఫిన్ బోటు ఆపరేటర్ల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సూరాడ సత్తిబాబు ‘సాక్షి’కి చెప్పారు. ఈ సమస్యపై పలుమార్లు పోర్టు అధికారులకు విన్నవించామని, త్వరలో చేపట్టనున్న ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణలో వీటిని వెలికితీస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

● అలా సాయం సంధ్య వేళలో..



ఏకాంత సాయంకాలపు..
వెండివర్ణాల సాగరతీరంలో..
హృదయంలో విరిసిన
సన్నజాజుల గానంలా..
ఓ జ్ఞాపకం హాయిగా పలకరిస్తోంది.
దాచిన రహస్యాలు విప్పిన
నూతన యవ్వన వనాల పరిమళాలు
విరజిమ్మే ఈ సాయంత్రం వేళ..
అలల నవ్వడులు..చిరుజల్లుల మధ్య
మోసుకొచ్చిన ఊసులతో అలా ఆర్కేబీచ్‌లో
ముచ్చటైన జంట ముచ్చట్లు..

– ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

బీసీల జనగణన చేపట్టాలి



సమావేశంలో పాల్గొన్న బీసీ సంఘం నేతలు

సీతంపేట: బీసీ జనగణన చేపట్టి, జనాభా దామాషా పద్ధతిలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నేతలు కోరారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు, జాతీయ కన్వీనర్ వై.నాగేశ్వరరావు యాదవ్, రాష్ట్ర మహిళాధ్యక్షురాలు నూకానమ్మ, విశాఖ జిల్లా అధ్యక్షుడు డబ్బీరు కుమారస్వామి మాట్లాడారు. బీసీ గణన చేపట్టకుండా కేంద్రం జాప్యం చేస్తోందని మండిపడ్డారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లు గడుస్తున్నప్పటికీ బీసీలకు రిజర్వేషన్ విషయంలో తగు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా బీసీలు సమాజంలో ఇప్పటికీ చెప్పుకోదగిన విధంగా అభివృద్ధి సాధించలేకపోయారన్నారు. తమ సంఘ జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో బీసీల సమస్యల పరిష్కారానికి పనిచేస్తున్నామని తెలిపారు. బీసీల సంక్షేమానికి చిత్తశుద్ధితో అందరూ కృషి చేయాలని సంఘ నేతలు పిలుపునిచ్చారు.

చాట్‌బోట్‌తో సెల్‌ఫోన్ల రికవరీ



బాధితుడికి ఫోన్ అప్పగిస్తున్న క్రైం డీసీపీ నాగన్న



స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు

- రూ.40 లక్షల విలువ గల 200 సెల్‌ఫోన్లు స్వాధీనం
- బాధితులకు అందించిన క్రైం డీసీపీ గంధం నాగన్న

అల్లిపురం: పోయిన సెల్‌ఫోన్ల రికవరీ నిమిత్తం నగర పోలీసులు రూపొందించిన చాట్ బోట్ వెబ్ పోర్టల్ సత్ఫలితాలనిస్తోందని నగర క్రైం డీసీపీ గంధం నాగన్న తెలిపారు. ఈ పోర్టల్ ద్వారా గతంలో 105 మొబైల్స్ రికవరీ చేసి బాధితులకు అందజేశామన్నారు. శుక్రవారం రూ.40 లక్షల విలువల గల 200 సెల్ ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అప్పగించనున్నట్లు తెలిపారు. సూర్యాబాగ్‌లోని నగర పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు. నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ ఆదేశాల మేరకు నగర ప్రజలకు చాట్ బోట్ వెబ్ పోర్టల్‌పై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

ఎలా ఫిర్యాదు చేయాలి

మొబైల్ పోగొట్టుకున్న వారు వాట్సాప్ నంబర్ (94906 17916)కి హాయ్ అని టైప్ చేయాలి. వెంటనే యూఆర్ఎల్ లింక్ http://bit.ly/3gx10Gg ఉన్న స్వీయ ప్రత్యుత్తరం వస్తుంది. ఈ లింక్‌పై నొక్కడం ద్వారా ఫారంలో అవసరమైన ఖాళీలను నింపడంతో ఫిర్యాదు నమోదవుతుంది. ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా, పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండానే ఫిర్యాదు చేయవచ్చు. అలాగే వాట్సాప్ నంబర్‌లో క్యూఆర్ కోడ్ డీపీగా ఉంటుంది. దీని ద్వారా గూగుల్ ఫారం స్కాన్ చేసి, ఫారంలో అవసరమైన సమాచారం నింపవచ్చు. బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదులను పర్యవేక్షించేందుకు ఎస్ఐ స్థాయి అధికారితో పాటు ఇద్దరు కానిస్టేబుళ్లు నిరంతరాయంగా పనిచేస్తుంటారు. వారు టెక్‌సెల్ డేటా సహాయంతో అన్ని సాంకేతిక కోణాల్లో విశ్లేషించి, బాధితులు పోగొట్టుకున్న మొబైల్స్ తిరిగి రికవరీ చేస్తారని క్రైం డీసీపీ తెలిపారు. ఈ విధంగా ఢిల్లీ, రాజస్థాన్, కేరళ, తమిళనాడు, ఒడిశా, తెలంగాణ రాష్ట్రాలతో పాటు తిరుపతి, గుంటూరు, పశ్చిమగోదావరి, తూర్పు గోదావరి, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో పోయిన మొబైళ్లను గుర్తించినట్లు వెల్లడించారు. సీసీఎస్ సిబ్బంది పోయిన మొబైళ్లు వినియోగిస్తున్న వారితో మాట్లాడి.. వారి నుంచి వాటిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం రికవరీ చేసిన సెల్‌ఫోన్లను ధ్రువపత్రాలు పరిశీలించి బాధితులకు అప్పగించారు. సీసీఎస్ సీఐలు ఆర్.సత్యనారాయణ, ఎస్.రమేష్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు



నగరంలోని మహిళా కళాశాల నుంచి పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు

- 39,474 మంది హాజరు
- ఇద్దరు డిబార్

విశాఖ విద్య: ఇంటర్ పరీక్షల్లో భాగంగా శుక్రవారం మొదటి సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన ఇంగ్లీషు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. విశాఖ జిల్లాలో 78 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 40,010 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా... 39,474 మంది హాజరైనట్లు ఇంటర్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారిణి పి. ఉమారాణి తెలిపారు. 536 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. విశాఖ నగరంలోని బాసర జూనియర్ కాలేజీలో, భీమిలి మండలం కాపులుప్పాడలోని నారాయణ జూనియర్ కాలేజీకి చెందిన ఓ విద్యార్థి మాస్‌కాపీయింగ్‌కు పాల్పతుండగా డిబార్‌కు చేశారు. ఆర్ఐవో ఉమారాణి విశాఖ నగరంలోని పలు కేంద్రాలను తనిఖీ చేసి, పరీక్షల నిర్వహణ తీరు పరిశీలించారు. కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారులకు సూచనలను పరీక్షలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

రెండో ప్రాధాన్యత ఓటుతోనే ఫలితం

- మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో ఎవరికీ దక్కని మ్యాజిక్ ఫిగర్
- కొనసాగుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్
- మొదటి ప్రాధాన్యత ఓట్లలో చిరంజీవిరావుకు 27,209 ఓట్ల ఆధిక్యం
- రెండో స్థానంలో సీతంరాజు, మూడో స్థానంలో రమాప్రభ

మొదటి ప్రాధాన్యత ఓట్లలో టాప్-4 అభ్యర్థుల ఓట్ల వివరాలివీ..

రౌండ్	మొత్తం ఓట్లు	చిరంజీవి	సీతంరాజు	రమాప్రభ	మాధవ్	చెల్లని ఓట్లు
1 రౌండ్	28,043	11,828	7,780	4,898	1,424	1,539
2 రౌండ్	27,991	12,274	7,619	4,669	1,280	1,557
3 రౌండ్	27,996	12,200	7,626	4,653	1,403	1,561
4 రౌండ్	28,005	11,517	7,813	4,788	1,563	1,688
5 రౌండ్	28,018	11,141	7,810	4,673	1,895	1,849
6 రౌండ్	28,080	10,861	7,966	5,451	1,338	1,923
7 రౌండ్	28,000	11,381	7,765	4,522	1,865	1,831
8 రౌండ్	5,200	1,755	1,330	1,494	116	370
పోస్టల్ బ్యాలెట్ 643						288



చిరంజీవిరావు



సీతంరాజు



రమాప్రభ

సాక్షి, విశాఖపట్నం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో ఎవరూ గెలుపునకు సరిపడా ఓట్లు సాధించకపోవడంతో రెండో ప్రాధాన్యత ఓట్లే గెలుపును నిర్ణయించనున్నాయి. శుక్రవారం నుంచి రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ఉత్కంఠ భరితంగా సాగుతోంది. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో అధికార పార్టీ వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్ కంటే ప్రతిపక్ష టీడీపీ మద్దతు అభ్యర్థి వేపాడ చిరంజీవిరావు ముందంజలో ఉన్నారు. మొత్తం 8 రౌండ్లు పూర్తయ్యే సరికి 27,209 ఓట్లతో టీడీపీ ఆధిక్యంలో ఉంది. ఈ నెల 13న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నిక జరగ్గా 16న కౌంటింగ్ ప్రారంభమైంది. మొత్తం 2,89,214మంది పట్టభద్రులు ఓట్లు నమోదు చేసుకోగా వీటిలో 2,00,926 ఓట్లు పోలయ్యాయి. గురువారం ఉదయం 7 గంటలకు రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ మల్లికార్జున సమక్షంలో స్ట్రాంగ్ రూమ్ నుంచి బ్యాలెట్ బాక్సులు తీసుకొచ్చారు. సాయంత్రం 6 గంటల వరకు కట్టలు కట్టే ప్రక్రియ జరిగింది. 7 గంటల నుంచి మొదటి ప్రాధాన్యత ఓటు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమై.. మొత్తం 8 రౌండ్లలో శుక్రవారం సాయంత్రం 4 గంటల వరకు కొనసాగింది. ఒక్కో రౌండ్‌కు 28 వేల ఓట్లు చొప్పున (2,00,926+355) ఓట్లను 8 రౌండ్లుగా విభజించారు.

12 వేలకు పైగా చెల్లని ఓట్లు

ఉత్తరాంధ్ర ఆరు జిల్లాల్లోని సుమారు 800 మంది ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు పొందగా.. వీటిలో 643 ఓట్లు పోలయ్యాయి. ఇందులో 288 ఓట్లను చెల్లనవిగా పరిగణించారు. శుక్రవారం సాయంత్రం 4 గంటల వరకు సాగిన మొత్తం ఎనిమిది రౌండ్ల లెక్కింపులో 12,318 వరకు చెల్లని ఓట్లు నమోదయ్యాయి. చెల్లని ఓట్లలో అధికంగా సీతంరాజు సుధాకర్‌కే వచ్చాయి.

34 మందికి డిపాజిట్లు గల్లంతు

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 37 మంది అభ్యర్థులు ఉంటే.. వారిలో 34 మంది అభ్యర్థుల డిపాజిట్లు గల్లంతయ్యాయి. వీరిలో బీజేపీ మద్దతు అభ్యర్థి, సిటింగ్ ఎమ్మెల్సీ పి.వి.ఎన్ మాధవ్ కూడా ఉన్నారు. మొత్తం చెల్లిన ఓట్లలో 1/6 వంతు ఓట్లు వచ్చిన అభ్యర్థికే డిపాజిట్లు వచ్చినట్టవుతుంది. అంటే 32 వేల ఓట్లు రావాలి. టీడీపీ మద్దతు అభ్యర్థి చిరంజీవిరావు (82,958 ఓట్లు) ముందంజలో ఉంటే.. వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్(55,749 ఓట్లు) రెండో స్థానంలో ఉన్నారు. ఇక పీడీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ 35,148 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. మిగిలిన 34 మంది డిపాజిట్లు కోల్పోయారు.

ఎవ్వరికీ దక్కని మ్యాజిక్ ఫిగర్

ఉత్తరాంధ్ర ఆరు జిల్లాల్లో మొత్తం 2,01,281 ఓట్లు పోల్ అవ్వగా.. ఇందులో 2,00,926 ఓట్లు, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 355 ఉన్నాయి. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో చెల్లని ఓట్లు పోను (50 శాతం +1) 94,481+1 వస్తే గెలిచినట్లు డిక్లేర్ చేస్తారు. కానీ ఎవరికీ మ్యాజిక్ ఫిగర్ రాకపోవడంతో రెండో ప్రాధాన్యత ఓటును ప్రామాణికంగా తీసుకుంటున్నారు.

తనిఖీలు చేపట్టి.. కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతి

దొండపర్తి: ఉత్తరాంధ్ర జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ పటిష్ట బందోబస్తు మధ్య జరుగుతోందని నగర పోలీస్ కమిషనర్ సి.హెచ్.శ్రీకాంత్ ఓ ప్రకటనలో తెలిపారు. కౌంటింగ్ కేంద్రంలోకి పాస్‌లు ఉన్న వారిని క్షుణ్ణంగా తనిఖీ చేసి.. మొబైళ్లను స్వాధీనం చేసుకున్న తర్వాతే లోపలకు అనుమతిస్తున్నట్లు వెల్లడించారు. కౌంటింగ్ ఏజెంట్ల నుంచి ఎమ్మెల్సీ అభ్యర్థుల వరకు ప్రతి ఒక్కరినీ ఇదే మాదిరిగా తనిఖీలు చేస్తున్నామన్నారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిని తనిఖీ చేయకుండా లోపలకు పంపించారన్నది అవాస్తవమన్నారు. ప్రవేశ ద్వారం వద్ద రెండు డోర్‌ఫ్రేం మెటల్ డిటెక్టర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొదటగా వచ్చిన వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిని తనిఖీ చేసి అతని నుంచి మొబైల్‌ను కూడా సిబ్బంది స్వాధీనం చేసుకున్నారని స్పష్టం చేశారు. ఆ తర్వాత వచ్చిన టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిని కూడా తనిఖీ చేశామన్నారు.

బకాయిలు చెల్లించి వడ్డీ మాఫీ పొందండి

డాబాగార్డెన్స్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ఆస్తి, ఖాళీ స్థలాల పన్నుపై వడ్డీ మాఫీకి మున్సిపల్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మి జీవో 34 విడుదల చేశారని, ఈ అవకాశాన్ని నగర ప్రజలు వినియోగించుకోవాలని జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు పేర్కొన్నారు. బకాయిలు మొత్తం చెల్లించి వడ్డీ మాఫీ పొందాలని పేర్కొన్నారు. వడ్డీని వన్‌టైమ్ మేజర్‌గా మాఫీ చేయడం జరుగుతుందని, అయితే, పన్ను చెల్లించాల్సిన చెల్లింపుదారులు బకాయి ఉన్న మొత్తాన్ని ఈ ఆర్థిక సంవత్సరంతో సహా ఒకే సారి ఈ నెల 31లోపు చెల్లిస్తే మినహాయింపు వర్తిస్తుందన్నారు. పన్నులను ఆన్‌లైన్ ద్వారా https://cdma.ap.gov.in/ నెట్–బ్యాంకింగ్ ద్వారా గానీ, డెబిట్/క్రెడిట్ కార్డుల ద్వారా గానీ, యూపీఐ ద్వారా కానీ చెల్లించవచ్చన్నారు.

అప్పన్న సన్నిధిలో ప్రముఖులు



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న ఎండోమెంట్ ట్రిబ్యునల్ జడ్జి హరినాథ్



కప్ప స్తంభానికి మొక్కుకుంటున్న శ్రీనివాసరావు

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామిని శుక్రవారం రాష్ట్ర దేవదాయశాఖ ట్రిబ్యునల్ జడ్జి కె.వి.ఎల్ హరనాథ్, రాష్ట్ర ఇన్ఫర్మేషన్ కమిషనర్ రేపల శ్రీనివాసరావు దర్శించుకుని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. వారి పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదం అందించారు.

వన్డే మ్యాచ్.. ట్రాఫిక్ ఆంక్షలు



దొండపర్తి : భారత్–ఆస్ట్రేలియా జట్ల మధ్య ఈ నెల 19న డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి ఏసీఏ–వీడీసీఏ స్టేడియంలో వన్డే క్రికెట్ మ్యాచ్ జరుగుతున్న నేపథ్యంలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. మ్యాచ్‌కు 27 వేల మంది క్రికెట్ అభిమానులు రానున్నారు. వీరితో సాధారణ వాహనదారులకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నగర పోలీస్ కమిషనర్ సి.హెచ్.శ్రీకాంత్ ఆదేశాల మేరకు పోలీస్ అధికారులు పలు సూచనలు చేశారు.

- మ్యాచ్ మధ్యాహ్నం 1.30 నుంచి రాత్రి 10.30 గంటల వరకు జరగనుంది. ఈ మ్యాచ్‌ను చూసేందుకు 27 వేల మంది రానున్నారు. వేల సంఖ్యలో వచ్చే వాహనాలతో స్టేడియం పరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోతాయి. దీంతో సాధారణ వాహనదారులు ఆయా సమయాల్లో ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ప్రయాణించాలి.
- శ్రీకాకుళం, విజయనగరం, ఆనందపురం వైపు నుంచి విశాఖకు వచ్చే బస్సులు, ఇతర కమర్షియల్ వాహనాలు మారికవలస వద్ద ఎడమ వైపు తిరిగి జురాంగ్ జంక్షన్ మీదుగా తిమ్మాపురం చేరుకోవాలి. అక్కడి నుంచి కుడి వైపు తిరిగి బీచ్ రోడ్డులో ప్రయాణించి రుషికొండ, సాగర్‌నగర్, జోడుగుళ్లపాలెం మీదుగా వెళ్లాలి.
- శ్రీకాకుళం, విజయనగరం, ఆనందపురం వైపు నుంచి వచ్చే కార్లు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు వంటివి కార్ షెడ్ వద్ద నుంచి మిథిలాపురి కాలనీలో ప్రవేశించాలి. అలా ఎంవీవీ సిటీ వెనుకగా వెళ్లి లా కాలేజీ రోడ్డు మీదుగా ఎన్‌హెచ్ 16 చేరుకుని నగరంలోకి వెళ్లాలి. లా కాలేజీ రోడ్డు నుంచి, పనోరమ హిల్స్ మీదుగా రుషికొండ వైపు వెళ్లి అక్కడి నుంచి నగరంలోకి వెళ్లవచ్చు.
- నగరం నుంచి ఆనందపురం, విజయనగరం, శ్రీకాకుళం వైపు వెళ్లే బస్సులు, కమర్షియల్ వాహనాలు హనుమంతవాక నుంచి ఎడమ వైపు తిరిగి, ఆరిలోవ బీఆర్‌టీఎస్ రోడ్డులో వెళ్లి, అడివివరం వద్ద కుడి వైపు తిరిగి ఆనందపురం మీదుగా వెళ్లాలి.
- నగరం నుంచి ఆనందపురం, విజయనగరం, శ్రీకాకుళం వైపు వెళ్లే కార్లు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు వంటివి హనుమంతవాక జంక్షన్ నుంచి ఎడమ వైపు తిరగాలి. అడవివరం మీదుగా ఆనందపురం వెళ్లవచ్చు. అలాగే విశాఖ వాలీ, ఎండాడ జంక్షన్ నుంచి కుడి వైపు తిరిగి, బీచ్‌రోడ్డుకు చేరుకుని తిమ్మాపురం వద్ద ఎడమ వైపు తిరిగి మారికవలస వద్ద ఎన్‌హెచ్ 16కు చేరుకోవాలి.

భారీ వాహనాలకు సూచనలు

- 19వ తేదీ ఉదయం 6 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు ఎటువంటి భారీ వాహనాలు మధురవాడ స్టేడియం వైపు అనుమతించరు.
- అనకాపల్లి నుంచి విజయనగరం, శ్రీకాకుళం వైపు వెళ్లే వాహనాలు, నగరంలోకి రాకుండా సబ్బవరం, పెందుర్తి, ఆనందపురం మీదుగా వెళ్లాలి.
- శ్రీకాకుళం, విజయనగరం నుంచి అనకాపల్లి వైపు వెళ్లే వాహనాలు నగరంలోకి రాకుండా, ఆనందపురం నుంచి పెందుర్తి, సబ్బవరం మీదుగా అనకాపల్లి వైపు వెళ్లాలి.
- అనకాపల్లి నుంచి విజయనగరం, శ్రీకాకుళం వైపు వెళ్లే భారీ వాహనాలన్నీ అనకాపల్లి వైపు నుంచి సబ్బవరం, పెందుర్తి, ఆనందపురం మీదుగా ప్రయాణించాలి.
- శ్రీకాకుళం, విజయనగరం వైపు నుంచి విశాఖకు వచ్చే భారీ వాహనాలన్నీ ఆనందపురం నుంచి పెందుర్తి, సబ్బవరం, అనకాపల్లి మీదుగా నగరానికి చేరుకోవాలి.

మ్యాచ్‌కు వచ్చే వాహనచోదకులకు సూచనలు

- నగరం వైపు నుంచి స్టేడియానికి వచ్చే వీవీఐపీ, వీఐపీ వాహనచోదకులు ఎన్‌హెచ్ 16లో స్టేడియం వరకు ప్రయాణించి, ఏ, బీ గ్రౌండ్లు, వీ కన్వెన్షన్‌కు పాసుల ప్రకారం చేరుకోవాలి.
- విశాఖ నుంచి స్టేడియానికి వచ్చే టికెట్ ఉన్న వారు ఎన్‌హెచ్ 16లో ప్రయాణించి స్టేడియం వద్ద గల ఓల్టేజ్ జంక్షన్ వద్ద ఎడమ వైపు తిరిగి సాంకేతిక ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్‌లో పార్కింగ్ చేసుకోవాలి. సాంకేతిక ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్‌లో ఆన్‌లైన్ టికెట్లను ఒరిజినల్ టికెట్లుగా మార్చుకునేందుకు కౌంటర్లు ఏర్పాటు చేశారు.
- శ్రీకాకుళం, విజయనగరం, ఆనందపురం, గంభీరం, బోయపాలెం, కొమ్మాది వైపు నుంచి వచ్చే వారు కార్ షెడ్ జంక్షన్ వద్ద కుడి వైపు తిరిగి సాంకేతిక ఇంజినీరింగ్ కాలేజీ పార్కింగ్ గ్రౌండ్‌కు చేరుకోవాలి. లేదా కారుషెడ్ జంక్షన్ నుంచి ఎడమ వైపు తిరిగి మిథిలాపురి కాలనీ మీదుగా వచ్చి.. ఎంవీవీ సిటీ డబుల్ రోడ్డు, పోలిశెట్టి వేణుగోపాలరావు గ్రౌండ్‌లో పార్కింగ్ చేసుకోవాలి.
- నగరం నుంచి లేదా భీమిలి వైపు నుంచి బీచ్ రోడ్డు మీదుగా స్టేడియానికి వచ్చే వారు ఐటీ సెజ్ మీదుగా ఎంవీవీ సిటీ డబుల్ రోడ్డుకు చేరుకుని అక్కడ పార్కింగ్ చేసుకోవాలి.
- నగరం నుంచి వచ్చే ఆర్టీసీ స్పెషల్ బస్సులు ఎన్‌హెచ్ 16లో రాకుండా, బీచ్‌రోడ్డులో వచ్చి ఐటీ సెజ్ మీదుగా లా కాలేజీ రోడ్డులో పార్కింగ్ చేయాలి.
- శ్రీకాకుళం, విజయనగరం, ఆనందపురం వైపు నుంచి వచ్చే ఆర్టీసీ స్పెషల్ బస్సులు, మారికవలస, తిమ్మాపురం, ఐటీ సెజ్ మీదుగా వచ్చి లా కాలేజీ రోడ్డుకు చేరుకుని పార్కింగ్ చేయాలి.
- పూర్తి భద్రతతో ఎటువంటి అపశ్రుతులూ జరగకుండా స్టేడియం చుట్టూ బారికేడ్లు ఏర్పాటుచేశారు.
- ప్రేక్షకులు నిర్దేశించిన గేట్ల ద్వారా మాత్రమే స్టేడియంలోకి ప్రవేశించాలి.

నేడు భారత్–ఆస్ట్రేలియా జట్ల రాక

స్టేడియంలో ఫ్లడ్‌లైట్లు పరిశీలించిన కమిటీ

విశాఖ స్పోర్ట్స్: భారత్–ఆస్ట్రేలియా రెండో వన్డే మ్యాచ్‌కు వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియం సిద్ధమైంది. ఆదివారం డే నైట్‌గా జరగనున్న ఈ మ్యాచ్‌కు స్టేడియంలో ఏర్పాటు చేసిన ఫ్లడ్‌లైట్లను శుక్రవారం వన్డే నిర్వాహక కమిటీ పరిశీలించింది. స్టేడియం అంతటా ఏ విధంగా ఫ్లడ్‌లైట్ల వెలుతురు ఉందనే విషయాన్ని పరిశీలించిన కమిటీ చైర్మన్, విశాఖ పోర్టు చైర్మన్ కె.రామ్మోహనరావు కాసేపు బ్యాటింగ్ చేశారు. తొలుత నిర్వాహక కమిటీ భేటీలో ఏర్పాట్లను సమీక్షించారు. టికెట్ల విక్రయంతో పాటు ప్రవేశ ద్వారాల వద్ద బార్‌కోడ్ పరిశీలన ఏర్పాట్లు, అనౌన్స్‌మెంట్, స్టేడియం వద్దకు వచ్చే వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, మంచినీరు, ఆహార పదార్థాల విక్రయం తదితర విషయాలపై చర్చించారు. మూడంచెల భద్రత ఏర్పాట్లను సమీక్షించారు. ఏసీఏ కార్యదర్శి గోపినాథరెడ్డి, ఉపాధ్యక్షుడు రోహిత్‌రెడ్డి, ఈపీడీసీఎల్ ఎండీ సంతోష్‌రావు, ఏసీఏ, వీడీసీఏ కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

నేడు ఇరుజట్ల రాక

సిరీస్ తొలిమ్యాచ్‌లో విజయంకేతనం ఎగురవేసిన భారత్ జట్టుతో పాటు ఆస్ట్రేలియా జట్టు సభ్యులు శనివారం మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో నగరానికి చేరుకోనున్నారు. తొలి మ్యాచ్‌కు కుటుంబ కార్యక్రమం కోసం వెళ్లిన రోహిత్ శర్మ ఈ మ్యాచ్‌కు విశాఖ వచ్చే సూచనలున్నాయి. వన్డేల్లో డబుల్‌సెంచరీ హీరోలు ఇషాన్ కిషాన్, శుభమన్ గిల్, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లితో పాటు జట్ల సభ్యులు రానున్నారు.

హాల్ టికెట్ల నిరాకరణపై నివేదిక ఇవ్వండి

సాక్షి ఎఫెక్ట్..

విశాఖ విద్య: ఫీజు చెల్లించలేదనే నెపంతో హాల్ టికెట్లు నిరాకరించిన కారణంగా ఇద్దరు ఇంటర్ విద్యార్థినులు పరీక్ష రాయలేకపోయిన విషయమై సమగ్ర నివేదిక ఇవ్వాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశించింది. ఈ మేరకు శుక్రవారం ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారిణి పి.ఉమారాణికి లేఖ రాసినట్లు కమిషన్ సభ్యుడు డాక్టర్ గొండు సీతారాం వెల్లడించారు. విశాఖ నగరంలోని బీవీకే కాలేజీ పరీక్ష కేంద్రంలో శ్రీనగర్‌లోని ఒకేషనల్ కాలేజీకి చెందిన ఇద్దరు విద్యార్థినులు తొలి రోజు పరీక్ష రాయలేకపోయారు. హాల్ టికెట్ లేకుండా కేంద్రానికి వచ్చిన వారిని నిర్వాహకులు పరీక్ష రాయనివ్వలేదు. ఫీజు చెల్లించకపోవడంతో కాలేజీ యాజమాన్యం హాల్ టికెట్ ఇవ్వలేదని చెప్పడంతో, ద్వారకా నగర్ ఎస్‌ఐ ధర్మేంద్ర చొరవ తీసుకొని విద్యార్థినులకు హాల్ టికెట్లు ఇప్పించారు. కాలేజీ నుంచి కేంద్రానికి వచ్చినప్పటికీ, సమయం మించిపోవడంతో ఆ విద్యార్థినులను పరీక్ష రాసేందుకు నిర్వాహకులు అనుమతించలేదు. ఇదే విషయం 'సాక్షి'లో శుక్రవారం ప్రచురితం కావడంతో దీన్ని సుమోటోగా తీసుకున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్.. దీనిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. అధికారుల సమర్పించే నివేదిక ఆధారంగా కాలేజీ యాజమాన్యం తప్పిదం ఉన్నట్లుగా తేలితే గుర్తింపు రద్దుతో పాటు, క్రిమినల్ చర్యలు తీసుకునేలా ప్రభుత్వానికి సిఫార్స్ చేస్తామని సీతారాం పేర్కొన్నారు. హాల్ టికెట్లు తీసుకోకుండా విద్యార్థినులు నేరుగా పరీక్ష కేంద్రానికి ఎందుకొచ్చారు? ఇందులో కాలేజీ యాజమాన్యం నిర్లక్ష్యం ఏమైనా ఉందనే విషయమై ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు కూడా ఆరా తీస్తున్నట్లు తెలిసింది.

చదువుకున్న కళాశాల కోసం..

- ఏయూ ఫార్మసీ కళాశాల హాస్టల్ నిర్మాణానికి రూ.50 లక్షల విరాళం
- తల్లిదండ్రుల పేరుతో గొప్ప మనసు చాటుకున్న దేవ పురాణం

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాల పూర్వ విద్యార్థి దేవ పురాణం విరాళంగా అందించిన రూ.50 లక్షలతో నిర్మించిన హాస్టల్ భవనం అందుబాటులోకి వచ్చింది. తన తల్లిదండ్రులు 'లలితాదేవి పురాణం–కోటిలింగ మూర్తి పురాణం'పేరుతో చదువుకున్న కళాశాలకు ఈ మొత్తం అందించగా.. ఫార్మసీ కళాశాలకు అనుకుని విద్యార్థినులకు హాస్టల్ భవనం నిర్మించారు. ఈ హాస్టల్ భవన సముదాయాన్ని శుక్రవారం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి సమక్షంలో దేవ పురాణం ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ తాను చదువుకున్న విశ్వవిద్యాలయానికి తిరిగి ఇవ్వాలనే మహోన్నత ఆశయం కలిగి ఉండటం అభినందనీయమన్నారు. విద్యార్థినులకు ఉపయుక్తంగా హాస్టల్ భవన సముదాయానికి నిధులు అందించిన దేవ పురాణాన్ని అభినందించారు. దేవ పురాణం వంటి వ్యక్తులను స్ఫూర్తిగా తీసుకుని నేటితరం విద్యార్థులు కంపెనీ సీఈవోలుగా, వ్యాపారవేత్తలుగా, శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. దీనికి అనువైన పరిస్థితులను ఏయూలో కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఏయూలో ఫార్మా టెస్టింగ్ లేబొరేటరీ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. దేవ పురాణం మాట్లాడుతూ తాను అమెరికాలోని ప్రముఖ ఫార్మసీ సంస్థ వైస్ ప్రెసిడెంట్‌గా సేవలందించడానికి కారణం తనకు విద్యనందించిన ఏయూ ఫార్మసీ కళాశాలేనన్నారు. హాస్టల్ భవన నిర్మాణం.. వర్సిటీ తనకిచ్చిన అవకాశంగా భావిస్తున్నట్లు చెప్పారు. రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య ఎ.కిశోర్ బాబు, ప్రిన్సిపాళ్లు ఆచార్య వై.రాజేంద్రప్రసాద్, టి.శోభశ్రీ, హాస్టల్ చీఫ్ వార్డెన్ ఎ.కె.ఎం.పవార్, పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ ఆచార్య జేమ్స్ స్టీఫెన్, పురాణం కోటిలింగం తదితరులు పాల్గొన్నారు.

'సెల్ టవర్లతో ఇబ్బందులు'

డాబాగార్డెన్స్: సెల్ టవర్ల వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని జీవీఎంసీ పట్టణ ప్రణాళికా విభాగం శుక్రవారం నిర్వహించిన స్పందనలో ఫిర్యాదులందాయి. జోన్–5 పరిధి మురళీనగర్ తదితర ప్రాంతాల్లో సెల్ టవర్ల వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని నూకరాజు ఫిర్యాదు చేశారు. భీమునిపట్నంలో నిబంధనలు ఉల్లంఘిస్తూ.. నిర్మాణాలు జరుగుతున్నాయని భీమిలికి చెందిన కొండవీటి శ్రీవెంకట ఆనందబాబు, జీవో–5, 97కి సంబంధించి జోన్–4 పరిధి జేఆర్ నగర్ నుంచి ఎస్ గోవిందరావు, జోన్–5 పరిధి 104 ఏరియా బాపూజీనగర్‌లో ఎటువంటి సెట్‌బ్యాక్స్ లేకుండా నిర్మాణాలు జరుగుతున్నాయని అప్పలస్వామిరెడ్డి, జోన్–6 పరిధి నరవలో రెసిడెన్షియల్ ఏరియాలో అనధికారికంగా వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నారని తోకాడ గ్రామ పరిరక్షణ సమితి సభ్యులు, గిరిజన కాలనీలో అనధికార కట్టడాలు జరుగుతున్నాయని పలువురు ఫిర్యాదు చేశారు. డీసీపీలు నరేంద్రనాథ్‌రెడ్డి, కె.పద్మజ, రత్నాకర్, ఏసీపీలు శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, వినయ్‌ప్రసాద్, అరుణవల్లి, రమణమూర్తి, సుభాన్ శాస్త్రి పాల్గొన్నారు.

నేరుగా ఫిర్యాదు చేయవచ్చు

జీవీఎంసీ పరిధిలో ఎలాంటి అనధికార నిర్మాణాలు, నిబంధనలు ఉల్లంఘించి భవనాలు నిర్మించినా.. భవన నిర్మాణ వ్యర్థాలు వేసినా.. టోల్ ఫ్రీ నంబర్ 1800 4250 0009/వాట్సాప్ నంబర్ 8187897569కు నేరుగా ఫిర్యాదు చేయవచ్చని కమిషనర్ రాజాబాబు ఓ ప్రకటనలో తెలిపారు.

పట్టభద్రులకు కృతజ్ఞతలు

సాక్షి, విశాఖపట్నం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి చెంపదెబ్బ తగిలినట్లేనని మాజీ మంత్రి, టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను చీల్చమని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చెప్పినట్లుగానే జరిగిందని పేర్కొన్నారు. శుక్రవారం విశాఖలో స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియం సమీపంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి వెంపాడ చిరంజీవిరావు లీడింగ్‌లో ఉండడానికి కారణమైన పట్టభద్రులకు పార్టీ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు చెబుతున్నామన్నారు. విద్యావంతులు ఇచ్చిన తీర్పుతో ప్రజల్లో మార్పు మొదలైందని గంటా శ్రీనివాసరావు అన్నారు.